ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కాకినాడ
జిల్లా వార్తలు
సోమవారం 15 ఏప్రిల్ 2024 | 5



లోవకు పోటెత్తిన భక్తులు
» ఆలయానికి రూ.3.54 లక్షల ఆదాయం 7లో
కరపలో లారీ ఢీకొని వ్యక్తి మృతి 7లో
బీచ్‌లో సందర్శకుల సందడి 7లో



ప్యాకేజీల వల

» నియోజకవర్గాల్లో ద్వితీయ, తృతీయ స్థాయి నేతలకు గిరాకీ
» అటు నుంచి ఇటు.. ఇటునుంచి అటు భారీగా చేరికలు
» నిబద్ధత ప్రశ్నార్థకం.. అభ్యర్థుల్లో ఆందోళన

తుని రూరల్, ఏప్రిల్ 14: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. కప్పదాట్లు కలవరపెడుతున్నాయి. ఎప్పుడు ఎవరు గోడ దూకుతారన్న ఆందోళన అన్ని పార్టీల్లో స్పష్టంగా కనిపిస్తుంది. సాధారణంగా ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు పార్టీలు మారుతున్నారు. ఒక పార్టీనుంచి మరొక పార్టీలోకి వెళ్లడం మామూలే. ప్రస్తుతం ట్రెండ్ మారింది. సామాన్య కార్యకర్తలు కండువాలు మార్చేస్తున్నారు. వందల కుటుంబాలు ఒక పార్టీనుంచి మరొక పార్టీలోకి జంప్ చేస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. వైసీపీనుంచి టీడీపీ, బీజేపీ, జనసేనలోకి, టీడీపీనుంచి వైసీపీలోకి వలసలు జోరుగా సాగుతున్నాయి. అన్ని పార్టీల అభ్యర్థులు వీటిని మరింత ప్రోత్సహిస్తున్నాయి. గ్రామస్థాయి నాయకులు ప్యాకేజీలు ఎరవేస్తున్నారు. దీంతో జిల్లాలో వలసల జోరు కొనసాగుతుంది. సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు పావులు కదుపుతున్నారు. ఈ ఎన్నికలకు రాజకీయ పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారాయి. ఎవరికి వారు ఎత్తులు పైఎత్తులు వేస్తున్నారు. ప్రస్తుతం ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ప్రత్యర్థి పార్టీలకు చెందే బలమైన ద్వితీయ, తృతీయ శ్రేణులను ఆకట్టుకునే పనిలో పడ్డారు.

ద్వితీయస్థాయి నాయకులు ప్యాకేజీల ఎర

జిల్లాలో పలు నియోజకవర్గాలతోపాటుగా తునిలో పార్టీలు మారే తంతు కొనసాగుతోంది. పెద్దఎత్తున మా పార్టీలో చేరారంటే మా పార్టీలో చేరారని రాజకీయ పార్టీలు ప్రకటించుకోవడం సర్వసాధారణంగా మారింది. ద్వితీయ, తృతీయ శ్రేణి గ్రామ, వార్డు స్థాయి నాయకులు పార్టీలు మారే కార్యక్రమం జోరుగా సాగుతోంది. పార్టీలు మారే నాయకులకు ప్యాకేజీ ఆశ చూపి అధికారంలోకి వస్తే మీ పనులు చక్కబెడతామని, మీ కేసులు మాఫీ చేస్తామని చెబుతూ ప్రలోభాలకు గురిచేస్తున్నారు. పార్టీలో చేరుతున్న వారి నిబద్ధత ఎంత అనేది ప్రశ్నార్థకమే. వాస్తవానికి ఆయా పార్టీల్లో చేరుతున్న వారు ఇది వరకు ఉన్న పార్టీలో ఏ మేరకు ఉత్సాహంగా పనిచేశారు. ఇతర కార్యకర్తలను, ఓటర్లను ఏ మాత్రం ప్రభావితం చేశారని నేతలు పట్టించుకోవడం లేదు. ఆయా పార్టీల కండువాలు కప్పేసి అంతా మా వారే అంటూ వ్యవహరిస్తున్నారు. తుని నియోజకవర్గంలో ఏదో జరిగిపోతుందోనని ఆలోచనలు జనాల్లోను, ముఖ్యంగా ప్రత్యర్థుల్లో రేకెత్తించేందుకు నాయకులు కొందరు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది. ఇలా ఎవరికి వారు తమ రాజకీయ ఎత్తుగడలు ప్రదర్శించడంతో రాజకీయం వేడెక్కుతోంది. పార్టీ కార్యకర్తలతోపాటు కుల సంఘాలు, ఉద్యోగ సంఘాలు, కార్మిక సంఘాలు సైతం రంగాల్లోకి దిగి ఈ వలసలు ప్రోత్సహించే అవసరం లేకపోలేదు. ఇంత భారీస్థాయిలో జరుగుతున్న వలసలు కారణంగా



ఎవరికి పుట్టి మునుగుతుందో అంతుచిక్కడం లేదు. ముఖ్యంగా అధికార పార్టీల నేతల్లో ఈ ఆందోళన ఎక్కువ కనిపిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. జిల్లాలో కార్యకర్తలు చేరిక ట్రెండ్ జోరుగా సాగుతుంది.

రూటు మార్చిన ఫైనాన్స్ వ్యాపారులు

» ఎన్నికల తనిఖీలతో ముందుజాగ్రత్త
» ఆన్‌లైన్ నగదు లావాదేవీలకే ప్రాధాన్యం

ప్రత్తిపాడు, ఏప్రిల్ 14: కాకినాడ జిల్లాలోని మెట్ట ప్రాంతంలో ఫైనాన్స్ వ్యాపారులు నగదు లావాదేవీలపై రూటు మార్చారు. రూ.50వేల మించి నగదు రవాణా చేయడం లేదా కలిగి ఉంటే అందుకు తగిన ఆధారాలు చూపాల్సిన నియమ నిబంధనలు అమల్లోకి రావడంతో ఫైనాన్స్ వ్యాపారులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. జిల్లా వ్యాప్తంగా స్క్వాడ్ బృందాలు ముమ్మర తనిఖీలు నిర్వహిస్తుండడంతో ఈ తనిఖీల్లో ఫైనాన్స్ వ్యాపారులు వసూలు చేస్తున్న నగదుకు ఆధారాలు ఏ విధంగా చూపాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. ఆన్‌లైన్‌లో నగదు లావాదేవీలు నిర్వహించడంపై వ్యాపారులు రూటు మార్చారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు నగదు రవాణాపై పటిష్టమైన నిఘా, తనిఖీలు ప్రత్యేక బృందాలు జిల్లాలోని ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలో ఫైనాన్స్ వ్యాపారులు నగదు రవాణా చేయడం, సమస్యగా మారింది. మెట్టప్రాంతానికి చెందిన ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో అత్యధిక, అల్పాదాయ వర్గాలు, పేదలు, మధ్య తరగతి కుటుంబీకులు అధికంగా వారపు వడ్డీలకు ఫైనాన్స్ వ్యాపారులవద్ద రుణాలు తీసుకుంటున్నారు. అనపర్తి, మండపేట ప్రాంతాలకు చెందిన ఫైనాన్స్ వ్యాపారులు ఏళ్ల తరబడి మెట్టప్రాంతంలో వారపు వడ్డీల వ్యాపారం ఉధృతంగా నిర్వహిస్తున్నారు. ఎలక్షన్ కోడ్ రాకముందు వీరి వ్యాపారానికి ఎటువంటి ఆటంకాలు రాలేదు. కోడ్ అమల్లోకి వచ్చాక ఫైనాన్స్ వ్యాపారులు నగదు గ్రామీణ ప్రాంతాలకు తరలించడం అక్కడినుంచి వసూలైన సొమ్మును తమ స్వస్థలాలకు తీసుకెళ్లడం పెద్ద సమస్యగా మారింది. ఈ నగదు రవాణా వ్యవహారంలో ప్రత్యేక బృందాలు నిర్వహించే తనిఖీల్లో ఎక్కడ దొరికిపోతామనే ఆందోళన ఫైనాన్స్ వ్యాపారుల్లో నెలకొంది. దీనిపై వ్యాపారులు నగదు లావాదేవీల కంటే ఆన్‌లైన్ లావాదేవీలకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. గ్రామాల్లో వసూళ్లు చేసిన నగదును దగ్గరలో ఉన్న అకౌంట్‌దారులకు కమిషన్‌లు ఇచ్చి తమ ఆన్‌లైన్ ఖాతాలకు జమ చేసుకుంటూ వ్యాపారం సాగిస్తున్నారు. ఎన్నికల కోడ్ పూర్తయ్యేంత వరకు ఫైనాన్స్ వ్యాపారులు వ్యాపారాన్ని ఏదోలా కొనసాగించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుంటూ స్క్వాడ్ బృందాల తనిఖీలకు గురికాకుండా ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఎన్నికల వేళ.. జోరుగా పందేలు

కరప, ఏప్రిల్ 14: సార్వత్రిక ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ పందెంరాయుళ్లు బరిలోకి దిగి జోరుగా పందేలు కాస్తున్నారు. ఏ నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారు.. ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి.. సీఎం ఎవరవుతారు.. తదితర అంశాలను ప్రాతిపదికగా తీసుకుని పందెం బరిలో నిలుస్తున్నారు. ఈ బెట్టింగ్‌ల్లో ఆరితేరిన మధ్యవర్తులవద్ద పెద్దఎత్తున పంచాయతీలు జరుగుతున్నాయి. పందెం బరిలో నిలిచిన ఇరు వర్గాలు సదరు మధ్యవర్తులకు కొంత మొత్తం సొమ్మును అడ్వాన్స్‌గా చెల్లిస్తూ ఉభయుల అంగీకారంతో హామీ పత్రాలు రాయించుకుంటున్నారు. పోలింగ్ ముందురోజు మిగిలిన మొత్తాన్ని మధ్యవర్తి సమక్షంలో జమచేసేలా ఒప్పందాలు చేసుకుంటున్నారు. నమ్మిక కలిగిన బెట్టింగ్‌రాయుళ్లు అయితే హామీ పత్రాలు వంటివి ఏమీ లేకుండానే మధ్యవర్తులు అంతా తామై వ్యవహరిస్తూ బెట్టింగ్ బాగోతాలను చక్కబెడుతున్నారు. దీనికి ప్రతిఫలంగా పందెం సొమ్ములో ఐదునుంచి పదిశాతం కమీషన్‌ను మధ్యవర్తులకు ముట్టచెబుతారని వినికిడి. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటినుంచి ఈ బెట్టింగ్‌లు మొదలయ్యాయి. రాజకీయపార్టీలు చేస్తున్న ప్రచారాలు, ఆయా పార్టీల్లో ఓటర్ల చేరికలతో రోజుకో విధంగా సమీకరణాలు మారుతున్నాయి. దీనికితోడు పోలింగ్‌కు నెల రోజులకుపైగా సమయం ఉన్నందున అప్పటికి పరిస్థితులు ఎలా ఉంటాయి అనే అంచనాల్లో పందెంరాయుళ్లు ఉన్నారు. ఈ నేపథ్యంలో పందేల జోరు కాస్త నెమ్మదించింది. పోలింగ్ ముగిసిన మర్నాడు పందేలు కాసుకోవడానికి కొందరి మధ్య ఒప్పందం జరిగినట్టు తెలిసింది. అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన కొంతమంది కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని పందెంరాయుళ్లతో ఇటీవల పెద్దమొత్తంలో బెట్టింగ్‌లు కలిపినట్టు తెలిసింది. ఈ ఎన్నికల్లో వైసీపీకి 80 సీట్లు మించిరావని కోనసీమ ప్రాంతం వాసులు బెట్టింగ్ కాయగా ఇక్కడి బెట్టింగ్‌రాయుళ్లు సిండికేట్‌గా ఏర్పడి పందేనికి సై అన్నారు. ఈ ఒక్క విషయమై వారి మధ్య రూ.1.40కోట్ల మేర పందెం జరిగినట్టు సమాచారం. కాకినాడ రూరల్‌లో వైసీపీ అభ్యర్థి గెలుస్తారని ఒక నేత ఎకరం పొలాన్ని పందెం కాయడానికి సిద్ధపడగా సహచరులు అతడ్ని వారించినట్టు సమాచారం. ఇక్కడి కూటమి అభ్యర్థి గెలుపుపై కూడా బెట్టింగ్‌లు కట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. గ్రామాల్లో ఏ పార్టీకి ఎన్ని ఓట్లు పడతాయనే దానిపై కూడా పందేలు కాయడానికి బెట్టింగ్‌రాయుళ్లు సిద్ధమవుతున్నారు. గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న ఈ పందాలపై నిత్యం బెట్టింగ్‌రాయుళ్ల మధ్య తీవ్రస్థాయిలో చర్చలు జరుగుతున్నాయి.

అగ్నిమాపక సిబ్బంది సేవలు కీలకం

» అమరవీరుల త్యాగాలు అజరామరం:
» అగ్నిమాపక వారోత్సవాల్లో కలెక్టర్ నివాస్



అమరవీరులకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ నివాస్

కాకినాడ క్రైం/కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 14: సమాజంలోని ప్రజల ధన, మాన, ప్రాణాలను రక్షించే క్రమంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించే అగ్నిమాపక సిబ్బంది సేవలు కీలకమని, అగ్ని ప్రమాదాల్లో అశువులు బాసిన అమరవీరుల త్యాగాలు అజరామరమని కలెక్టర్ జె.నివాస్ కొనియాడారు. కాకినాడ రామారావుపేటలోని జిల్లా అగ్నిమాపక కేంద్రంలో ఆదివారం ఆయన అగ్నిమాపక వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1944 ఏప్రిల్ 14 న బొంబాయి ఓడరేవులో గన్ పౌడర్ లోడ్‌తో వున్న ఫోర్ట్ స్ట్రైకింగ్ నౌకలో అగ్నిప్రమాదం సంభవించి అనేక నౌకలకు, ఇతర బిల్డింగులకు విస్తరించింది. ఈ క్రమంలో విధి నిర్వహణలో వున్న 66 మంది అగ్నిమాపక సిబ్బంది, 336 మంది ప్రజలు చనిపోగా మరో 87 మంది అగ్నిమాపక సిబ్బందికి తీవ్ర గాయాలయ్యాయన్నారు. అప్పటి నుంచి అమరవీరుల సంస్మరణార్థం ప్రతి ఏడాది ఏప్రిల్ 14 నుంచి 20 వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు జరుపుకుంటూ అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. అగ్ని ప్రమాదాలు, ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు అగ్ని మాపక చేసే కార్యక్రమాలు సాహసోపేతంగా ఉంటాయన్నారు. ప్రజలకు భద్రత కల్పించడమే కాకుండా ప్రభుత్వ ప్రైవేటు ఆస్తులను కాపాడం జరుగుతుందన్నారు. ప్రమాదాలు సంభవించినప్పుడు అగ్నిమాపక సిబ్బందికి ప్రజలందరు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఏదైన ప్రమాదం జరిగినప్పుడు దానిని నివారించడం కంటే ప్రమాదం జరగక ముందే ఎటివంటి విధి విధానాలు పాటించాలి, ప్రమాదాలు జరగకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. జిల్లా అగ్నిమాపక అధికారి సురేందర్ ఆనంద్ మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలో 370 ఫైర్ కాల్స్, 53 రెస్క్యూ కాల్స్ వచ్చాయన్నారు. ఈ కాల్స్ ద్వారా రూ. 13.155 కోట్ల విలువైన ఆస్తులను కాపాడడం జరిగిందన్నారు. 53 రెస్క్యూ కాల్స్‌లో 7 గురు ప్రాణాలు కోల్పోయారని అయితే 46 మంది ప్రాణాలను, 34 పశువులను కాపాడడం జరిగిందన్నారు. జిల్లాలోని 7 ఫైర్‌స్టేషన్‌ల్లో 109మంది సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. తొలుత కలెక్టర్ నివాస్ విధి నిర్వహణలో అమరులైన సిబ్బందికి పూలమాల్లలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం అగ్నిమాపక వారోత్సవాలు సందర్భంగా రూపొందించిన కరపత్రాలు, పోస్టర్‌లను ఆయన ఆవిష్కరించారు. విపత్తులు సంభవించినప్పుడు ఏ విధంగా రెస్క్యూ ఆపరేషనల్ నిర్వహిస్తారో ఆయా అత్యాధునిక పరికరాల ప్రదర్శనలను తిలకించి వాటిని ఉపయోగించే విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అగ్నిమాపక వారోత్సవాల శకటాలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సాలిపేట ఏడీఎఫ్ఓ వి. సుబ్బారావ్, పిఠాపురం ఏడీఎఫ్ఓ డి.రామకృష్ణరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీరు పదవికి రాజీనామా చేస్తే రూ.20వేలు?

రౌతలపూడి, ఏప్రిల్ 14: వలంటీరు పదవికి రాజీనామా చేస్తే రూ.20వేలు, పైగా అధికారంలోకి వస్తే మళ్లీ వలంటీర్లుగా మీరే నియామకం అంటూ కాకినాడ వైసీపీ ఎంపీ అభ్యర్థి వలంటీర్లకు ఆఫర్ ఇచ్చినట్టు సమాచారం. రెండురోజులక్రితం కిర్లంపూడిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో రౌతులపూడి, ఏలేశ్వరం మండలాల్లో ఇటీవల రాజీనామా చేసిన వలంటీర్లకు రహస్య సమావేశం ఏర్పాటు చేశారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. సమావేశానికి రాజీనామాలు చేసిన వలంటీర్లు 750మంది హాజరయ్యారు. వారితో వైసీపీకి చెందిన ప్రత్యేక యాప్‌లో మీ పరిధిలో 50 కుటుంబాలు ఏ పార్టీకి ఓటు వేస్తారు? అందులో టీడీపీ వాళ్లు ఎంతమంది ఉన్నారు? అనేది సర్వే చేయాలి.. ఇలా చేస్తే మీకు రూ.20వేలు ఇస్తామని ఆఫర్ చేసినట్టు తెలిసింది. పని చేయించుకుని వదిలేస్తే అనే అనుమానాన్ని వలంటీర్లు వ్యక్తం చేయగా సమావేశం జరిగిన వారంరోజుల్లో రూ.20వేలు వేస్తామని హామీ ఇచ్చినట్టు తెలిసింది.

మానవజాతి కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్: కలెక్టర్ నివాస్

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 14: దేశానికి రాజ్యాంగం రచించి మానవ జాతికోసం పోరాడిన వ్యక్తి అంబేడ్కర్ అని జిల్లా కలెక్టర్ జె.నివాస్ కొనియాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కాకినాడ ఇంద్రపాలెం సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి కలెక్టర్ నివాస్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. అన్నివర్గాల ప్రజల కోసం ఆయన గొంతెత్తి పోరాడారన్నారు. భారతదేశంలోని వనరులను సరిగ్గా వినియోగించుకునేందుకు ఆర్బీఐ స్థాపన దగ్గరనుంచి ప్రతి అంశంలోను ఆయన కృషి, పట్టుదల కనిపిస్తోందన్నారు. ఒక సమాజం పురోగతిని మనం అంచనా వేయాలంటే ఆ సమాజంలో మహిళల పురోగతిని పరిశీలించాలని 1927లో అంబేడ్కర్ మహిళలకోసం చాలా గొప్పగా మాట్లాడారన్నారు. ఒక జయంతి రోజున గుర్తు చేసుకోవడం మాత్రమే కాకుండా ప్రతి రోజూ ఆయన్ను మనం గుర్తు పెట్టుకుంటూ ఆయన బాటలో నడవాలన్నారు. ప్రపంచంలో కొన్ని పెద్ద దేశాల్లో పౌరులకు ఓటుహక్కు లేదన్నారు. చదువులేని వాళ్లకి కూడా మనదేశంలో ఓటుహక్కు కల్పించి న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. సాంఘికసంక్షేమశాఖ జేడీ రమణమూర్తి, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, కాకినాడ కమిషనర్ వెంకట్రావు, డీపీఆర్వో నాగార్జున, ఆర్డీవో కిషోర్ పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ నివాస్



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్



పిఠాపురంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జనసేన నేత నాగబాబు, మాజీ ఎమ్మెల్యే వర్మ, బీజేపీ నాయకుడు కృష్ణంరాజు

అంబేడ్కర్‌ను వైసీపీ సర్కారు అవమానించింది

» జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు

పిఠాపురం, ఏప్రిల్ 14: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను వైసీపీ సర్కారు అవమానపరిచిందని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు తెలిపారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా పిఠాపురం పట్టణంలోని రథాలపేట సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, బీజేపీ ఇన్‌చార్జి డాక్టర్ బుర్రా కృష్ణంరాజులతో కలిసి ఆదివారం ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా అమలులో ఉన్న అణగారిన వర్గాల విద్యార్థుల విదేశీ స్కాలర్‌షిప్ పథకానికి ఉన్న అంబేడ్కర్ పేరును తొలగించి తన పేరు పెట్టుకోవడం జగన్‌లోని పెత్తందారీతనానికి నిదర్శనమన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ పథకానికి అంబేడ్కర్ పేరు పెడతామని ప్రకటించారు. జనసేన జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ్, నియోజకవర్గ సమన్వయకర్త మర్రెడ్డి శ్రీనివాసరావు, తుమ్మలపల్లి చంద్రశేఖర్, ప్రొఫెసర్ శరత్‌కుమార్, కూసంపూడి శ్రీనివాస్‌పాల్గొన్నారు.

సమస్యల వలయంలో జగనన్న కాలనీలు

» అధికారుల ఒత్తిడితో లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలు
» తీరా చూస్తే కనీస సదుపాయాలు లేవు
» లబోదిబోమంటున్న లబ్ధిదారులు
» ఎన్నికల ప్రచారంలో వైసీపీని నిలదీస్తున్నవైనం



కిర్లంపూడి మండలంలో బురదతో ఉన్న జగనన్న కాలనీ

కిర్లంపూడి, ఏప్రిల్ 14: జగనన్న కాలనీలు సమస్యల వలయంగా మారుతున్నాయి. రోడ్లు, విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకున్నా ఇప్పటికీ కనీస వసతులు ఏర్పాటు చేయకపోవడంతో గగ్గోలు పెడుతున్నారు. కిర్లంపూడి మండలంలో వేలంక, కిర్లంపూడి, చిల్లంగి, ముక్కొల్లు పరిసర గ్రామాల్లో లబ్ధిదారులందరికీ స్థలాలు ఇచ్చి జగనన్న కాలనీలుగా మార్చారు. కొన్నిచోట్ల మంచి నీటి ట్యాంకు నిర్మాణం చేపట్టి పూర్తి చేయకుండా మధ్యలోనే ఆపేశారు. స్థలాలు ఇచ్చి సంవత్సరాలు గడుస్తున్నా రోడ్ల నిర్మాణం పూర్తవకపోవడంతో లబ్ధిదారులకు కష్టతరంగా మారింది. ప్రభుత్వం అధికారులపై తీవ్ర ఒత్తిడి తేవడంతో అధికారులు లబ్ధిదారులను పిలిచి ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలని లేకపోతే స్థలం వెనక్కిపోతుందని చెప్పడంతో అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకున్నారు. తీరా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించిన సరైన వసతులు లేకపోవడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. వేలంక, సింహాద్రిపురం గ్రామాల్లో లబ్ధిదారులకు స్థలాలకు ఇచ్చినప్పటికీ కాలనీ ఏర్పాటు చేయకపోవడంతో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాలేదు. ఎండాకాలం కాబట్టి సరిపోతోంది. వర్షాకాలంలో రోడ్లన్నీ బురదమయంగా మారడంతో నానా పాట్లు పడుతున్నారు. ప్రస్తుతం ఎన్నికల హడావిడి రావడంతో కొత్త ఇళ్ల నిర్మాణాలు జరగడంలేదు. ఎన్నికల పేరు చెప్పి అధికారులు కూడా జగనన్న కాలనీలపై దృష్టి పెట్టడంలేదు. దీంతో తమను పట్టించుకునే వారెవరని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఓట్లు అడగడానికి వచ్చే వైసీపీ నాయకులను లబ్ధిదారులు తమకు మౌలిక సదుపాయాల కల్పనపై నిలదీస్తుంటే వారేమో సమాధానం చెప్పలేకపోతున్నారు. ఎన్నికలు అయ్యే వరకు కాలనీల్లో ఎటువంటి అభివృద్ధి జరిగే అవకాశం లేదని పలువురు వాపోతున్నారు.

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా సుంకర పావని



కాకినాడ సిటీ, ఏప్రిల్ 14: టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా కాకినాడ మాజీ మేయర్ సుంకర పావని నియమితులయ్యారు. ఈ మేరకు టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ఆదివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం కాకినాడ జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలిగా పావని కొనసాగుతున్నారు.

రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించాలి
» విమర్శకుల నోళ్లు మూతబడ్డాయి
» మెగా అభిమానుల సమావేశంలో నాగబాబు 7లో

వైసీపీ చెత్త ప్రభుత్వాన్ని తుడి చేసే సమయం వచ్చింది 7లో
» జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు

లోవకు పోటెత్తిన భక్తులు

» ఆలయానికి రూ.3.54 లక్షల ఆదాయం



భక్తులకు దర్శనమిస్తున్న తలుపులమ్మ అమ్మవారు, బారులు తీరిన భక్తులు

తునిరూరల్, ఏప్రిల్14: లోవదేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారి దర్శనార్థం తెలుగురాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ప్రత్యేక క్యూలైన్‌లో బారులుతీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన వారు దేవస్థానం ఏర్పాటుచేసిన ఆరుబయట వంటషెడ్‌లలో, వసతి గదుల్లో వంటావార్పు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. ఆదివారం ఒక్కరోజే ఆలయానికి వివిధ విభాగాల ద్వారా రూ.3.54 లక్షలు ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో విశ్వనాథరాజు తెలిపారు.

రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించాలి

» విమర్శకుల నోళ్లు మూతబడ్డాయి

» మెగా అభిమానుల సమావేశంలో నాగబాబు



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు

పిఠాపురం, ఏప్రిల్ 14: రాష్ట్రంలో వైసీపీ పాలన అంతం కావాలంటే అన్ని శక్తులు ఏకం కావాల్సిన అవసరం ఉందని జనసేన ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు అన్నారు. చిరంజీవి బ్లడ్‌బ్యాంకు, ఐ బ్యాంకు ఇతర సేవా కార్యక్రమాల్లో పాల్గొనే అభిమానులు ఇక రాజకీయాల్లోనూ చురుకైన పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం కుమారపురంలోని గోకులం గ్రాండ్‌లో ఆదివారం చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షుడు రవణం స్వామినాయుడు, జిల్లా అధ్యక్షుడు మేడిశెట్టి సూర్యకిరణ్(కత్తిపూడి బాబీ) ఆధ్వర్యంలో మెగా అభిమానుల ఆత్మీయ సమావేశం జరిగింది. చిరంజీవి జనసేనపార్టీకి రూ.5కోట్లను ప్రోత్సాహకంగా అందించడం సంతోషకరమైన విషయమన్నారు. చిరంజీవి మద్దతు జనసేనకు లేదనే విమర్శకుల నోళ్లు ఇప్పుడు మూతబడ్డాయని, ఆయన ఆశీస్సులు ఎప్పుడు జనసేనకు ఉంటాయని నాగబాబు తెలిపారు. చిరంజీవి మద్దతుతో జనసేన బలం రెట్టింపయిందని చెప్పారు. మెగా అభిమానులంతా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని ఆయన కోరారు. తన వ్యక్తిగత సంపద దాచుకోకుండా కుల, మత, ప్రాంతీయ ఆలోచనలు లేకుండా సమాజంపట్ల బాధ్యతగా ఎన్నో ప్రజోపయోగకరమైన సేవలు చేయడమేకాక, పలువురికి అండగా నిలుస్తున్న పవన్‌కల్యాణ్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జనసేన స్టార్ క్యాంపయినర్ సాగర్(ఆర్‌కే నాయుడు) తెలిపారు. ఒక వ్యక్తిగా ఇంత చేసిన పవన్ వ్యవస్థకు ప్రతినిధిగా ఉంటే ఎంత చేయగలరో ఆలోచించాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షుడు పి.భవానీకుమార్, ఏడిద శ్రీనివాస్, శ్యామ్‌ప్రసాద్, కృష్ణప్రసాద్, రవికుమార్, చంద్రశేఖరరెడ్డి, బైరు వెంకన్నగౌడ్, రమేష్‌నాయుడు, కోపల్లి శ్రీనివాస్, జి.కొండలరావు పాల్గొన్నారు.



సందర్శకులతో కిక్కిరిసిన సాగరతీరం

బీచ్‌లో సందర్శకుల సందడి

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 14: కాకినాడరూరల్ సూర్యారావుపేట సాగర తీరం సందర్శకులతో కిక్కిరిసిపోయింది. ఆదివారం సెలవు దినం కావడం, వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో వేసవి తాపం నుంచి సేదతీరేందుకు జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున సందర్శకులు, చిన్నారులతో కుటుంబ సభ్యులు తరలివచ్చారు. ఈ సందర్భంగా సముద్రంలో జలకాలాటలు ఆడుతూ యువత, పెద్దలు ఎంజాయ్ చేశారు. చిన్నారులు సముద్ర తీరంలో సముద్ర ఇసుకలో ఆటపాటలాడుతూ, కేరింతలతో ఉత్సాహంగా గడిపారు. తిమ్మాపురం ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు ఆధ్వర్యంలో సిబ్బంది తీరంలో గస్తీ నిర్వహించారు.

శ్రీ ప్రకాష్‌లో జీవన తరంగిణి పుస్తకావిష్కరణ



తరంగిణి పుస్కకావిష్కరణ చేస్తున్న ప్రముఖులు

తునిరూరల్, ఏప్రిల్ 14: బొవైన్ మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో పశుపోషక శాస్త్ర విజ్ఞాన కవి డాక్టర్ యెలినేని రాఘవరావు జీవన తరంగిణి పుస్తకావిష్కరణ, సన్మాన వేడుక ఆదివారం ఆట్టహాసంగా జరిగింది. శ్రీ ప్రకాష్ విద్యాసౌధంలో నిర్వహించిన రైతు అవగాహన సదస్సుకు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. పుస్తకావిష్కరణ అనంతరం ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రిటైర్డ్ డాక్టర్ మన్మోహన్ సింగ్, గౌరవఅతిథులుగా విచ్చేసిన ఇక్రిశాట్ సీనియర్ సైంటిస్ట్(రిటైర్డ్)డాక్టర్ రవిందర్ రెడ్డి, పశు సంవర్ధకశాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ వై.సింహాచలం రాఘవరావు సేవలను కొనియాడారు. పశు పోషకులను సమాజంలో గౌరవంగా నిలబెట్టేందుకు రాఘవరావు చేసిన కృషి అమోఘమని స్ఫూర్తిదాయకమైన జీవనానికి చిరునామా డాక్టర్ రాఘవరావు అని పేర్కొన్నారు. రాఘవరావు అందించిన సేవలు, పరిశోధనలు ఎంతోమంది పాడి రైతుల తరుపున ఆయనకు కృతజ్ఞతగా ఆయన జీవన గమనంపై ఒక పుస్తక రూపకల్పన చేయాలనే ఆలోచనకు ప్రతి రూపమే ఈ జీవన తరంగిణి అని తెలిపారు. బొవైన్ మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ వీకే నరసింహారావు మాట్లాడుతూ కృషితో నాస్తి దుర్భిక్షం అనే నానుడి రుజువు పరిచేటట్లుగా ఆయా రంగాల్లో నీతి నిజాయితీలతో పనిచేసిన వ్యక్తులను సత్కరించుకోవడం పరిపాటి అని అన్నారు. తాను ఎన్నుకున్న తన కోసం కాకుండా పాడి రైతుల కోసం పాటుపడే డాక్టర్ రాఘవరావు అందించిన సేవలు అభినందనీయమని పాడి రైతుల తరుపున ఆయనకు కృతజ్ఞతగా ఒక పుస్తకం రూపకల్పన చేయాలనే ఆలోచనకు కార్యరూపం దాల్చి జీవన తరంగిణి అనే పుస్కకావిష్కరణ కార్యక్రమం నేడు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాబార్డు రిటైర్డ్ సీజీఎం పి.మోహనయ్య, డాక్టర్ కె. నరేంద్రబాబు, పంజ్‌బదానా, డాక్టర్ వి. రవీంద్రబాబు, చంద్రశేఖర్, ప్రసన్నకుమార్, డాక్టర్ సింహాచలం, బొవైన్ మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీ డైరెక్టర్లు, మెంబర్లు, గ్రామాల ప్రముఖులు, రైతులు పాల్గొన్నారు.



అల్లవరం: గూడాలలో జరిగిన అగ్నిప్రమాదంలో దగ్ధమవుతున్న ఇళ్లు

గూడాలలో అగ్ని ప్రమాదం

» మూడు తాటాకిళ్లు దగ్ధం » రూ.9లక్షల ఆస్తి నష్టం

» నిరాశ్రయులైన నాలుగు కుటుంబాలు

అల్లవరం, ఏప్రిల్ 14: వారి ఆశలు కళ్లెదుటే కాలి బూడదయ్యాయి. అర్ధరాత్రి ఎగసిపడ్డ మంటలకు భయపడి పిల్లాపాపలతో పరుగులు తీశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం గూడాల పల్లయ్యచెరువు గట్టు వద్ద శనివారం అర్ధరాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో అగ్నిప్రమాదం జరిగింది. ఆకుల వెంకట్రావు, ఆకుల సత్యనారాయణ, ఆకుల మంగతాయారు నివసిస్తున్న తాటాకిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. మూడు కుటుంబాల వారు కట్టుబట్టలతో బయటపడ్డారు. అదే ఇంట్లో ఉంటున్న దొడ్డా సత్యవతి నిరాశ్రయురాలైంది. వెంకట్రావు ఇంట్లో టీ కాచేందుకు గ్యాస్ వెలిగించగా మంటలు చెలరేగి అగ్నిప్రమాదం జరిగిందని చెబుతున్నారు. 8వ తరగతి చదువుతున్న బాలిక గమనించి అందరి ప్రాణాలు కాపాడింది. అమలాపురం నుంచి అగ్నిమాపక శకటం వచ్చి చివరి క్షణంలో మంటలను ఆర్పివేసింది. గంధం పల్లంరాజు, పోలిశెట్టి నాయుడు బాధిత కుటుంబాలను పరామర్శించి రూ.30వేలు సాయం అందజేశారు. మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జడ్పీటీసీ కొనుకు గౌతమి, ఆర్.నానిరాజు, కొనుకు బాపూజీ, దాకారపు చిరంజీవి బాధిత కుటుంబాలను పరామర్శించి రూ.5వేలు వంతున ఆర్థిక సాయం, నిత్యావసరాలు అందజేశారు. టీడీపీ నేతలు అయితాబత్తుల ఆనందరావు, మెట్ల రమణబాబు, దెందుకూరి సత్తి బాబురాజు, పంపిరెడ్డి కాశీ బాధితులకు రూ.22వేలు అందజేశారు. పోలిశెట్టి భాస్కరరావు, తాటికాయల సుధీర్, రాసూరి రాంబాబు బాధిత కుటుంబాలను పరామర్శించారు.

స్మార్ట్‌ఫోన్ మాదిరిగా పరిణయ శుభలేఖ

» సెల్‌ఫోన్ షాపు యజమాని వినూత్నంగా పెళ్లి కి ఆహ్వానం



సెల్‌ఫోన్ మాదిరిగా పరిణయ శుభలేఖను త యారు చేసిన దృశ్యం

అంబాజీపేట, ఏప్రిల్ 14: వినూత్న ఆలోచనలతో ఎవరి అభిరుచికి తగినట్లు వారు శుభలేఖలు తయారు చేయించుకుంటున్న కల్చర్ ఈ మధ్య ఎక్కువైంది. కాలానుగుణంగా శుభలేఖల ముద్రణలో కొత్త ఒరవడి ఎప్పటికప్పుడు నడుస్తోంది. దీనిలో భాగంగా అంబాజీపేట మండలం గంగలకుర్రు అగ్రహారంనకు చెందిన మొబైల్ షాపు రిపేర్ యజమాని గ్రంధి మణికంఠ వినూత్న ఆలోచనలతో తన పెళ్లి శుభలేఖను తానురోజు రిపేరుచేసే సెల్‌ఫోన్ మాదిరిగా పరిణయ శుభలేఖను తయారు చేయించుకున్నాడు. ముందుభాగంలో వధూవరుల ఫొటోలు, మధ్యలో పెళ్లికి సంబంధించిన వివరాలు, చాటింగ్ మాదిరిగా మెజేస్ రూపంలో పెట్టి, వెనుక భాగంలో క్యూఆర్‌కోడ్‌ను ముద్రించి సుమారు 1000 శుభలేఖలను ముద్రించారు. క్యూఆర్‌కోడ్ స్కాన్ చేస్తే పెళ్లి వివరాలు అన్నీ సెల్‌ఫోన్ శుభలేఖలో కనిపిస్తాయి. గ్రంధి రామ్మోహనరావు, సత్యభామ దంపతుల ద్వితీయ కుమారుడు గ్రంధి మణికంఠ, మాధురిల వివాహం ఈనెల 18వ తేదీన భీమవరంలో జరుగుతుందని ముద్రించిన శుభలేఖలను కుటుంబ సభ్యులతో పాటు బంధుమిత్రులు, స్నేహితులు, శ్రేయోభిలాషులకు అందించి పెళ్లికి రావాలంటూ ఆహ్వానం పలుకుతున్నాడు.

దుర్గాడ శివాలయంలో ప్రత్యేక పూజలు

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 14: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు చెరుకూరివీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు జరిపించారు.



ప్రత్యేక అలంకారంలో రామలింగేశ్వరస్వామి

బిక్కవోలులో వివాహిత ఆత్మహత్య



బిక్కవోలులో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన చిన్ని

అనపర్తి, ఏప్రిల్ 14: వివాహం జరిగి ఏడాది కాకుండానే ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం బిక్కవోలులో జరిగింది. ఎస్ఐ బుజ్జిబాబు, మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం విశాఖ జిల్లా కొత్త ఎల్లవరం గ్రామానికి చెందిన మద్ది చిన్ని(24)కి, రాజవొమ్మంగి మండలం ఒట్టిగడ్డకు చెందిన ఆవుగడ్డ ప్రసాద్‌తో గత ఏడా ది జూన్‌లో వివాహం జరిగింది. ప్రసాద్ బిక్కవోలు మండలం బలభద్ర పురం గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తుం డగా చిన్ని బిక్కవోలులో వలంటీర్‌గా పనిచేస్తూ ఇటీవల రాజీనామా చేసింది. శనివా రం రాత్రి భార్యాభర్తలు చెరో గదిలో నిద్రపోయారు. అయితే ఆదివారం ఉదయం చిన్ని గది నుంచి బయటకు రాకపోవడం, తలుపులు లోపలికి గడియవేసి ఉండడంతో ప్రసాద్ ఇంటి యజమానుల సహా యంతో త లుపులు పగులగొట్టి చూడగా ఆమె ఉరి వేసుకుని మృతి చెందింది. దీంతో ప్రసాద్ పోలీసులకు సమాచారం అందించాడు. అలాగే చిన్ని తల్లిదండ్రు లకు సమాచారం అందించడంతో వారు బిక్కవోలు చేరుకుని కుమార్తె మృతదేహం వద్ద విలపించారు. అయితే భార్యాభర్తలు అన్యోన్యంగా ఉండేవారని ఎందుకు ఆత్మహత్యకు పాల్పడిందో అర్థం కావడం లేదని చిన్ని తండ్రి మద్దు వెంకటరమణ రోధిస్తున్నాడు. మృతురాలి తండ్రి వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి మృత దేహాన్ని ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వివాహిత ఆత్మహత్య

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 14: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. సామర్లకోట మండలం వీకే రాయపురం గ్రామానికి చెందిన మేరి(30)కి, చేబ్రోలు గ్రామానికి చెందిన దొండపాటి డేవిడ్‌రాజుకు 14 ఏళ్ల క్రితం వివాహం అయింది. వారికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భర్త డేవిడ్‌రాజు కుటుంబాన్ని సరిగా పట్టించుకోకపోవడంతో మేరీయే పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించేది. ఆర్థిక ఇబ్బందులు అధికం కావడంతో శనివారం రాత్రి ఇంటిలోకి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మేరీ మృతిపై తండ్రి కావు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గొల్లప్రోలు ఎస్ఐ బాలాజీ తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



మృతిచెందిన వాసంశెట్టి లోవరాజు

కరప, ఏప్రిల్ 14: కాకినాడజిల్లా కరప శ్మశానవాటిక సమీపంలో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. కరప పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కరప మండలం వలసపాకల గ్రామానికి చెందిన వాసంశెట్టి లోవరాజు(35) కాకినాడ పోర్టులో మూటల పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం డ్యూటీ ముగించుకుని మోటర్‌సైకిల్‌పై కాకినాడ నుంచి వలసపాకల బయలుదేరాడు. కరప శ్మశానవాటిక సమీపంలోకి వచ్చేసరికి రామచంద్రపురం నుంచి కాకినాడ వెళుతున్న లారీ వేగంగా వచ్చి లోవరాజును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లోవరాజును కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి



దున్నా రవీంద్రనాథ్ రాగూర్

నల్లజర్ల, ఏప్రిల్ 14: నల్లజర్ల మండలం ఘంటావారిగూడెం గ్రామానికి చెందిన దున్నా రవీంద్రనాథ్ రాగూర్(24)రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. రాగూర్ ఆదివారం పొలం పనులు ముగించుకుని తన బైక్‌పై ఇంటికి వస్తుండగా బైపాస్ రోడ్డులో డివైడర్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

గండేపల్లి, ఏప్రిల్ 14: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. స్థానిక పోలీసుల సమాచారం మేరకు మండలంలో కాకినాడ జిల్లా గండేపల్లి మండలం తాళ్ళూరు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డుప్రమాదంలో మల్లేపల్లి తిమ్మాపురం గ్రామానికి చెందిన శెట్టిపల్లి సుబ్రహ్మణ్యం ఉప్పలపాడు నుంచి తాళ్ళూరు జాతీయ రహదారి ఎక్కుతుండగా వైజాగ్ నుంచి రాజమండ్రి వెళ్లే కారు ఢీ కొట్టడంతో అతనికి తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం జగ్గంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించారు. అలాగే పెద్దాపురం గ్రామానికి చెందిన నవుడు కిశోర్, జెడ్ రాగంపేట సర్వీసురోడ్డులో రాంగ్‌రూట్‌లో జగ్గంపేట వైపు మోటార్ సైకిల్‌పై వస్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టడంతో అతనికి బలమైన గాయాలయ్యాయని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రామేశంపేటలో రూ.1.18 లక్షలు పట్టివేత



రంగంపేట: రామేశంపేట చెక్‌పోస్ట్ దగ్గర కారును తనిఖీ చేస్తున్న పోలీస్ సిబ్బంది

రంగంపేట, ఏప్రిల్ 14: తూర్పుగోదావరిజిల్లా రంగంపేట మండలం రామేశంపేట చెక్‌పోస్ట్ వద్ద ఎటువంటి అధికార పత్రాలు లేని రూ.1.18 లక్షలు సొమ్మును స్వాధీనం చేసుకున్నట్టు ఫ్లయింగ్ స్క్వాడ్, మండల మేజిస్ట్రేట్ పి.వెంకటరత్నం ఆదివారం తెలిపారు. కోనాల హశ్వంత్‌రెడ్డి యానాం నుంచి రాజమహేంద్రవరానికి కారులో వెళ్తుండగా రామేశంపేట చెక్‌పోస్ట్‌వద్ద నిర్వహించిన తనిఖీలో ఈ సొమ్మును గుర్తించినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌టీ కానిస్టేబుల్ జీవీ ఎస్ఎస్ రెడ్డి, చెక్‌పోస్ట్ కానిస్టేబుల్స్ కె.ఆదినారాయణ, జి.వెంకటలక్ష్మి, రంగంపేట ఎస్ఐ పి.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



తాళ్లరేవు: పి.మల్లవరం చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న కమిషనర్

పి.మల్లవరం సెబ్ చెక్‌పోస్టు పరిశీలన

తాళ్లరేవు, ఏప్రిల్ 14: పి.మల్లవరం, సుంకరపాలెం, ఎన్‌ఫోర్స్‌మెంట్ సెబ్ చెక్‌పోస్టును ఆదివారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) జాయింట్ కమిషనర్ టి.నాగలక్ష్మి తనిఖీ చేశారు. యానాం-కాకినాడ రూట్‌లో వాహనాలను పరిశీలించారు. ఎన్నికలకోడ్ అమల్లో ఉన్నందున చెక్‌పోస్టుల వద్ద చేసే తనిఖీ విధులపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సెబ్ అధికారులు టి.సత్యనారాయణ, ఏ.ఎస్. దొర, సెబ్ ఇన్‌స్పెక్టర్ ఎమ్.రామశేషయ్య పాల్గొన్నారు.

గోదావరి డెల్టాకు నీటి విడుదల నిలిపివేత

ఏపీ జెన్కో డొంకరాయి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయ్‌కుమార్



డొంకరాయి జలాశయం వద్ద గేట్లు కిందకు దింపుతున్న సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ శ్రీధర్

మోతుగూడెం, ఏప్రిల్ 14: వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయి జలాశయం నుంచి గోదావరిడెల్టా రబీ పంటలకు శనివారం సాయంత్రం నుంచి నీటి విడుదలను నిలిపివేశామని ఏపీ జెన్కో డొంకరాయి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఈ.విజయ్‌కుమార్ తెలిపారు. సీలేరు కాంప్లెక్స్‌లో విద్యుత్ ఉత్పత్తి అనంతరం విడుదలయ్యే నీరు గోదావరి డెల్టాకు నీరు చేరుతుందని, అయితే పొల్లూరులో పూర్తిస్థాయి విద్యుత్ ఉత్పత్తి చేస్తేనే 3500నుంచి 4వేలు క్యూసెక్కుల వరకు నీరు చేరుతుందని రబీలో మార్చి ఏప్రిల్‌లో అధికంగా నీటి అవసరం ఉన్న నేపథ్యంలో ఇరిగేషన్ అధికారులు 7వేల క్యూసెక్కులు అవసరమని విన్నవించడంతో శనివారం సాయంత్రం వరకు డొంకరాయి జలాశయం ద్వారా నేరుగా (విద్యుత్ ఉత్పత్తి లేకుండా)3500 క్యూసెక్కుల నీటిని విద్యుత్ ఉత్పత్తి ద్వారా మరో 3500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామన్నారు. విద్యుత్ ఉత్పత్తి లేకుండా ఇప్పటివరకు గోదావరి డెల్టాకు 4248 టీఎంసీల నీటిని విడుదల చేశామన్నారు. ప్రస్తుతం సీలేరు కాంప్లెక్స్‌లో 5నుంచి 6 మిలియన్ యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని ఆయన వివరించారు. గోదావరి డెల్టాలోని రబీ పంటలకు సీలేరు నుంచి నీటి విడుదల నిలిపివేశారు. ఈనెల ఒకటినుంచి గోదావరి డెల్టాకు డొంకరాయిజలాశయం నుంచి రెండు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. ఈనెల ఒకటి నుంచి 13వ తేదీ వరకు 4.28 టీఎంసీల నీటిని విడుదల చేశారు. సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ బొడ్డు శ్రీధర్ ఆధ్వర్యంలో గేట్లు కిందకి దింపించారు. కార్యక్రమంలో ఏపీ జెన్కో లోయర్ సీనియర్ ప్లాంట్‌మేనేజర్ భీమవరం బాలకృష్ణ, ఏడీలు, ఏఈలు పాల్గొన్నారు.

రాజుపేట గ్రామంలో

ఎమ్మెల్యే ధనలక్ష్మికి నిరసన సెగ



రాజవొమ్మంగి : బరదనాంపల్లి పంచాయతీ రాజుపేట గ్రామంలో ఎమ్మెల్యే ధనలక్ష్మిని నిలదీస్తున్న గ్రామస్థులు

రాజవొమ్మంగి, ఏప్రిల్ 14: అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలంలో పలు గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మికి నిరసన సెగ ఎదురైంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం రాత్రి 9.30కు బరదనాంపల్లి పంచాయతీ రాజుపేట గ్రామానికి ఎమ్మెల్యే ధనలక్ష్మి వెళ్లగా గ్రామస్థులు గ్రామంలో ఉన్న పలు సమస్యలపై నిలదీశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాజుపేట గ్రామానికి రహదారి సౌకర్యం లేదని, పాఠశాల శిథిలావస్థలో ఉందని ఎన్నిసార్లు అధికారులకు పాలకులకు చెప్పినా పట్టించుకోవట్లేదని పిల్లలు చనిపోతే ఎవ రు బాధ్యులని గ్రామస్థులు ప్రశ్నించారు. గ్రామంలో తాగునీటి సమస్య వెంటాడుతుందని, గ్రామానికి వెళ్లే దారిలో వైసీపీ నాయకులు నాణ్యతలేని కాజ్వే నిర్మించారన్నారు. గ్రామంలో చాలామందికి కుల ధ్రువీకరణ పత్రాలు లేవని తెలిపారు. స్థానిక వైసీపీ నేతలుకలుగజేసుకొని ఆపేందుకు ప్రయత్నం చేశారు.

వైసీపీ చెత్త ప్రభుత్వాన్ని

తుడిచేసే సమయం వచ్చింది

» జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు

పిఠాపురం, ఏప్రిల్ 14: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలను పట్టి పీడిస్తున్న వైసీపీ చెత్త ప్రభుత్వాన్ని తుడిచి వేసే సమయం వచ్చిందని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు అన్నారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పిలుపు మేరకు కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని ఉప్పాడ సెంటర్‌లో క్లీన్ పిఠాపురం-గ్రీన్ పిఠాపురం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. పురవీధులను చీపుర్లతో శుభ్రపరిచారు. చెత్త మాదిరిగానే వైసీపీని రాష్ట్రం నుంచి శుభ్రం చేయడం ఖాయమన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రజాస్వామ్య విధానాలతో అన్నివర్గాలకు న్యాయం చేస్తామని తెలిపారు. అంబేడ్కర్ జయంతి రోజున ఇటువంటి కార్యక్రమం చేపట్టడం ఆనందంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



క్లీన్ పిఠాపురం-గ్రీన్ పిఠాపురం కార్యక్రమంలో రోడ్లు ఊడుస్తున్న జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు

మండుతున్న ఎండలు

కిర్లంపూడి, ఏప్రిల్ 14: మండుతున్న ఎండలతో ప్రజలు హడలిపోతున్నారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రత అధికంగా ఉంది. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేదు. ఎండ తీవ్రత కారణంగా ప్రజల సంచారం లేక రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఎండల ధాటికి వృద్ధులు, గర్భిణులు అల్లాడిపోతున్నారు. రానున్న రోజుల్లో ఎండ తీవ్రత మరింత పెరిగేలా ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



ఏలేశ్వరం సమావేశంలో సత్యప్రభ, టీడీపీ నాయకులు

'సానుభూతి పొందడానికే జగన్ డ్రామాలు'

ఏలేశ్వరం, ఏప్రిల్ 14: ప్రజల్లో సానుభూతి పొందడానికే జగన్ డ్రామాలు ఆడుతున్నారని ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ విమర్శించారు. ఆదివారం పట్టణంలో కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి నివాసంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో సత్యప్రభ మాట్లాడుతూ గతంలో కోడి కత్తి డ్రామాలు ఆడి సానుభూతితో గెలిచారని, ఇప్పుడు కొత్తగా గులకరాయి పేరుతో ప్రజల్లో ఆదరణ పొందాలని చూస్తున్నారని విమర్శించారు. సీఎంపై దాడి జరిగితే సెక్యూరిటీ సిబ్బంది ఏం చేస్తున్నారని, ఇదంతా వైసీపీ నాయకులు పక్కా ప్లాన్ ప్రకారం చేసిందేనన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు మూది నారాయణస్వామి, అలమండ చలమయ్య, ఎండగుండి నాగబాబు, పెంద్ర శ్రీను, సఖిరెడ్డి విజయబాబు, కొప్పుల బాబ్జి, పలివెల శ్రీనివాస్, బూర్లు సత్తిబాబు, పాల్గొన్నారు. మండలంలోని తిరుమాలిలో టీడీపీ నాయకులు ఆధ్వర్యంలో మాగాపు శ్రీనివాస్, అంజూరి రాంబాబు, కానూరి రాజా, కె. లోవరాజు, మచ్చా పుత్రయ్య, అడబాల రామకృష్ణ, సాకా ఏసుబాబు, కట్టా వెంకటేశులు, జానకిశ్రీను, వెరిగుక్క దేవి తోపాటు సుమారు 50కుటుంబాలు వైసీపీని సత్యప్రభ సమక్షంలో టీడీపీలో చేరారు.

'కొత్త డ్రామా ప్రారంభించిన జగన్'

పిఠాపురం, ఏప్రిల్ 14: ప్రజల్లో పెల్లుబికుతున్న వ్యతిరేకతతో జగన్‌రెడ్డి కొత్తగా గులకరాయి డ్రామా ప్రారంభించారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ఎద్దేవా చేశారు. పట్టణంలోని 23,24,25 వార్డులు, మండలంలోని మంగితుర్తి గ్రామంలో ఆయన ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ జగన్ ఎన్నికల ప్రచారంలో ఎక్కడికక్కడ వ్యతిరేకత వస్తుండడంతో సానుభూతి కోసం రాయి దాడి నాటకాన్ని కొత్తగా తెరపైకి తెచ్చారని తెలిపారు. జగన్ డ్రామాలను ప్రజలు నమ్మే రోజులు పోయాయని తెలిపారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు పాల్గొన్నారు.

'గులకరాయి దాడి డ్రామాకు తెరలేపిన జగన్'

కాకినాడ సిటీ, ఏప్రిల్ 14: జగన్‌రెడ్డి ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి ఆదరణ లేకపోవడంతో గులకరాయి దాడి డ్రామాకు తెరలేపారని కాకినాడ సిటీ అసెంబ్లీ నియోకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు ఎద్దేవా చేశారు. కాకినాడ జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం పర్యటన జరుగుతుంటే పదేపదే కరెంటు తీయడం ముందుగా వేసుకున్న పథకంలో భాగమేనన్నారు. గత ఎన్నికలకు ముందు కోడి కత్తి డ్రామా.. ఇప్పుడు గులకరాయి దాడి సీక్వెల్ అని అన్నారు. నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నాయకులు గ్రంధి నారాయణరావు, కటకంశెట్టి బాబి, గదుల సాయిబాబు, కొల్లాబత్తుల అప్పారావు, తుమ్మల రమేష్, పలివెల రవి అనంతకుమార్ పాల్గొన్నారు.

'జనసేన విజయానికి కృషి'

కాకినాడ రూరల్, ఏప్రిల్ 14: కాకినాడ రూరల్‌లో జనసేన విజయానికి అందరూ సమష్టిగా కృషి చేయాలని రూరల్ జనసేన-టీడీపీ-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి పంతం నానాజీ కోరారు. రూరల్ మండలం చీడిగలోని కల్యాణ మండపంలో మాజీ ఎంపీటీసీ గీసాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల, కార్యకర్తల ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. నానాజీ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పేదలకిచ్చిన ఇళ్లపట్టాలు బూటకమన్నారు, కార్యక్రమంలో టీడీపీ కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, నురుకుర్తి వెంకటేశ్వరరావు, ప్రకాష్‌గౌడ్, కొజు నెహ్రూ, మహేష్, రాంబాబు, కోటిపల్లి శ్రీను, గవర శ్రీరాములు, నక్కాశ్రీను, పాండ్రంకి రాజు తదితరులు ఉన్నారు.

వైసీపీ నుంచి జనసేనలోకి భారీగా చేరికలు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 14: కాకినాడ-జగన్నాథపురం 24, 25 డివిజన్‌ల నుంచి వైసీపీ శ్రేణులు భారీగా జనసేనలో చేరారు. కుంతీదేవిపేటకాలనీ, ముగ్గుపేట ప్రాంతాలకు చెందిన పోలినాటి బాల, పోలినాటి శ్రావణి, ఎద్దు వెంకటలక్ష్మి, కోట శ్రీను, కోట భవానీలతోపాటు 200 కుటుంబాల వారు శనివారం రాత్రి జనసేనలో చేరారు. ఈ సందర్భంగా కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, మల్లాడి గంగాధర్, నక్కా రత్నంరాజు పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్: కాకినాడ రూరల్ పెనుమర్తికి చెందిన సుమారు 40 మంది వైసీపీ కార్యకర్తలు జనసేన పార్టీ నాయకుడు సలాది శ్రీను ఆధ్వర్యంలో వలసపాకల గంగరాజునగర్ జనసేన పార్టీ కార్యాలయంలో జనసేనలో చేరగా కాకినాడ రూరల్ జనసేన-టీడీపీ కూటమి అభ్యర్థి పంతం నానాజీ కండువాలు వేసి ఆహ్వానించారు.

233 మంది విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్

కాకినాడ రూరల్, ఏప్రిల్ 14: కాకినాడ ఐడియల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో 2020-24 బ్యాచ్‌లో సివిల్, ఈఈఈ, మెకానికల్, ఈసీఈ, సీఎస్ఈ ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన 233 మంది విద్యార్థులు ప్లేస్‌మెంట్స్ సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీకాంత్ తెలిపారు. కళాశాలలో ఆదివారం ప్లేస్‌మెంట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు, ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్ఎస్ మూర్తి, కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినీకుమారి, డైరెక్టర్ కృష్ణంరాజు, ఏవో వర్మ ముఖ్య అతితులుగా పాల్గొని ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను వారి తల్లిదండ్రులను అభినందించి మెమెంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల పీఆర్వో సాయిబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శాస్త్రీయ సంగీత కచేరి

పిఠాపురం, ఏప్రిల్ 14: పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం చెలికాని బావనరావు సభాసదన్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన వేణుగానబ్రహ్మ భైరవభొట్ల వెంకట సుబ్రహ్మణ్యశర్మ వేణుగాన శాస్త్రీయ సంగీత కచేరి ఆహూతులను ఆకట్టుకుంది. వయోలిన్‌పై పెరవలి నందకుమార్(గుంటూరు), మృదంగంపై మహాదాసు ఏడుకొండలు(విజయనగరం)లు సహకారం అందజేశారు. సంగమేశ్వర సంగీత సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గట్టి శ్రీకృష్ణదేవరాయ, వి.గాయత్రి, కె.భాగ్యం, పి.సత్యనారాయణ, రాజకుమార్, కొండేపూడి శంకరరావు, డాక్టర్ ముళ్లపూడి నాగేశ్వరరావు, కృష్ణంరాజు, మన్మధరావు, అప్పారావు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సమావేశం రహస్య ప్రదేశానికి మార్పు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 14: కాకినాడ సంజయ్‌నగర్ పిడుగలమ్మ తల్లి గుడి సమీపంలోని వైసీపీ ప్రచార కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన వలంటీర్ల సమావేశాన్ని హడావుడిగా రహస్య ప్రదేశానికి మార్పు చేశారు. వలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేసిన సమాచారం తెలుసుకున్న టీడీపీ నాయకులు కాకినాడ సిటీ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేయడంతో తనిఖీ బృందం అక్కడకు చేరుకున్నారు. విషయం తెలియడంతో వైసీపీ నాయకులు హడావుడిగా సమావేశాన్ని రహస్య ప్రదేశానికి మార్పు చేసి వలంటీర్లను వాహనాల్లో తరలించారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

ప్రత్తిపాడు, ఏప్రిల్ 14: పెద్దిపాలెంలో పక్కుర్తి అచ్చిరాజు, లోవరాజు, మాణిక్యం కుటుంబాలకు చెందిన 3పోర్షన్‌ల తాటాకిళ్లు విద్యుత్ షాక్ సర్క్యూట్ వల్ల శుక్రవారం దగ్ధమైన విషయం తెలిసిందే. బాధిత కుటుంబాలకు ఆదివారం బీసీవై పార్టీ రాష్ట్ర సమన్వయ సారథి డాక్టర్ అనూషయాదవ్, ఆమె తండ్రి దేవర రమణ రూ.10వేలు ఆర్థిక సహాయంఅందించారు. ఈగల తాతబాబు, గొర్ల వీరబాబు, దేవర రాంబాబు, బుద్ధాల పెంటయ్య, మన్యాల రాజు, పంచదార్ల సత్తిబాబు, పాతల రాజబాబు, ఉల్లి వెంకట స్వామి, దేవర సత్తిబాబు, పక్కుర్తి రమణ, లొండా దిల్లియ్య పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం

పిఠాపురం, ఏప్రిల్ 14: పట్టణంలోని ఫైర్‌స్టేషనలో అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. వారం రోజులు పాటు జరిగే కార్యక్రమాల్లో భాగంగా అగ్నిప్రమాదాలు జరగకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తారు. కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ రామకృష్ణరాజు, ఈఎన్‌టీ వైద్యుడు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట మండలంలో కోడి పందేలు

జగ్గంపేట, ఏప్రిల్ 14: జగ్గంపేట మండలం మామిడాడ, ఇర్రిపాక గ్రామాల మధ్య ఏలేరు నదిపరివాహక ప్రాంతం నందు ఆదివారం సాయంత్రం కోడిపందేలు జరిగాయి. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా పోలీస్ సిబ్బంది విధుల్లో నిమగ్నం కావడంతో పందెంరాయుళ్లు ఇదేఅదునుగా కోడిపందాలు నిర్వహిస్తున్నట్టు స్థానికులు చెప్తున్నారు.

పెద్దాపురంలో మజ్జిగ పంపిణీ

పెద్దాపురం, ఏప్రిల్ 14: స్థానిక పాత బస్టాండ్ వద్ద ఆదివారం హరిశంకరాచార్య వేదశాస్త్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు ట్రస్ట్ అధ్యక్షుడు చిట్టెం హరిగోపాలశర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ట్రస్ట్ సభ్యులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

వాడవాడలా రాజ్యాంగ నిర్మాత జయంతి వేడుకలు

ఘనంగా నివాళులర్పించిన నాయకులు, అధికారులు

బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్





కాకినాడ సిటీ:అంబేడ్కర్ చిత్రపటానికి టీడీపీ నేతల నివాళి, సర్పవరం జంక్షన్:నివాళులర్పిస్తున్న ఏఎస్పీ అర్జున్, తునిలో నివాళులర్పిస్తున్న యనమల దివ్య

కాకినాడ సిటీ, ఏప్రిల్ 14: బడుగు,బలహీన వర్గాల ఆశాజ్యోతి, సమసమాజ స్వాప్నికుడు బాబాసాహెబ్ అంబేడ్కర్ అని మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా కాకినాడ జిల్లా టీడీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కొల్లాబత్తుల అప్పారావు, కటకంశెట్టి బాబి, మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, వాసిరెడ్డి చిట్టిబాబు, పలివెల రవిఅనంతకుమార్, బంగారు సత్యనారాయణ, రెడ్నం సత్తిబాబు, పోలిపల్లి జగన్, ముగ్గల్ల బాబూరావు నెల్లి రమణ పాల్గొన్నారు. అంబేడ్కర్ జయంతిని కాకినాడలోని ఏపీఎన్జీవోస్ హోమ్‌లో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.రామ్మోహనరావు, పేపకాయల వెంకటకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ గుద్దడి రామ్‌మోహనరావు పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, సహాధ్యక్షుడు మట్టపర్తి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు పాలపర్తి మూర్తిబాబు, సరెళ్ల చంద్రరావు, సంయుక్త కార్యదర్శి ఎన్ఎంకేజీ ప్రసాద్, కాకినాడ యూనిట్ అధ్యక్ష కార్యదర్శిలు సత్తిరాజు, రామకృష్ణ, రమణమూర్తి, రమేష్, కరప యూనిట్ అధ్యక్షుడు రవి, మహిళా విభాగం చైర్‌పర్సన్ బి.సుజాత పాల్గొన్నారు. దళిత, గిరిజన, బీసీ, ముస్లిం, క్రైస్తవ ఐక్యవేదిక ఆధ్వర్యంలో జగన్నాథపురం అన్నమ్మఘాటీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వన్‌టౌన్ సీఐ వి.సురేష్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరై అంబేడ్కర్, బాబూ జగజ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు డోకుబుర్ర భద్రం మాస్టారు, ఉపాధ్యక్షుడు ఆవుపాటి ఉమాశంకర్, ప్రధాన కార్యదర్శి సాపే సుధాకర్, కార్యదర్శులు సిద్ధాంతపు రాజు, కొండేపూడి రవికుమార్, బండి నరేంద్ర, కండవల్లి సుందర వీరబాబు, ఆటో యూనియన్ సభ్యులు కొమ్ముకూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కాకినాడ క్రైం: సామాజిక వివక్షతను రూపుమాపేందుకు అహర్నిశలు తన శక్తివంచన లేకుండా పోరాడిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యుగ పురుషుడని ఎస్పీ సుబ్రమణి సతీష్‌కుమార్ కొనియాడారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆదివారం అంబేడ్కర్ చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ బి.సత్యనారాయణ, సీఐలు, ఎస్పీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి అంబేడ్కర్ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ కోనాల అనిత, ఏడీ అనురాధ, ఆస్పత్రి జేఏసీ చైర్మన్ పాలపర్తి మూర్తిబాబు, కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, ఫార్మసిస్ట్ శశి, హెచ్ఐ సువర్ణరాజు పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్: కాకినాడ ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి అడిషనల్ ఎస్పీ ఎల్ అర్జున్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్స్ సాంబయ్య, సత్యనారాయణ, ఆర్ఐలు సురేష్‌బాబు, రాము, రవిశంకర్, రామకృష్ణ తదితర అధికారులు పాల్గొన్నారు. వాకలపూడిలో అంబేడ్కర్ విగ్రహానికి కాకినాడ రూరల్ సీపీఎం కన్వీనర్ తిరుమలశెట్టి నాగేశ్వరరావు, సీఐటీయూ కన్వీనర్ తొట్టిపూడి రాజా పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మేడిశెట్టి వెంకటరమణ, శ్రీహరి, డి.సత్యనారాయణ, వి.సత్తిబాబు పాల్గొన్నారు.

పిఠాపురం: పట్టణంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఆంధ్రప్రదేశ్ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుబ్బల రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు ముంజవరపు కృపానందం, దారా వెంకట్రావు, బందిలి సూరిబాబు, పొన్నాడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. సాంఘిక సంక్షేమశాఖ బాలికల వసతిగృహంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, సిద్దు, వెంకటేష్, లోవరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నండూరి ప్రసాదరావు భవనంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.సత్తిరాజు, కుంచే చిన్నా, కోనేటి రాజు, నాగేశ్వరరావు, మణి, వీరబాబు, రాజేష్ పాల్గొన్నారు.

గొల్లప్రోలు: గొల్లప్రోలు ఎస్సీ కాలనీ, ఏకేమల్లవరం గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహానికి ఏఐఎఫ్‌టీయూ నేతలు కుంచే అంజిబాబు, గుడాల చార్లెస్, కేశవరపు వీరన్న, బళ్ల సోమరాజు పూలమాలలు వేశారు. దుర్గాడలో అంబేడ్కర్ విగ్రహానికి ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, ఎస్ఐ బాలాజీలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులందజేశారు.

సామర్లకోట: మండలంలోని హుస్సేన్‌పురం దళితవాడలో ఎమ్మెల్యే తనయుడు నిమ్మకాయల రంగనాగ్, తోటకూర శ్రీనివాస్, చల్లా బుజ్జిల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. గుమ్మళ్ళ రామకృష్ణ, తలారి శ్రీనువాస్, తలారి పోతురాజు, కోట అప్పారావు, కోట సురేష్ పాల్గొన్నారు. మాధవపట్నంలో టీడీపీ నాయకుడు పెంకే వెంకటేష్ ఆధ్వర్యంలో వేడుకల్లో అంబేడ్కర్ విగ్రహానికి రంగనాగ్ పూలమాల వేశారు. మాజీ సర్పంచ్ పిల్లి కృష్ణప్రసాద్, చీకట్ల వెంకటేష్, పోతుల సత్యనారాయణ, విత్తనాల వెంకటరమణ కూటమి నాయకులు పాల్గొన్నారు.

పెద్దాపురం: స్థానిక పాత పెద్దాపురంలో కోట ముందు వద్ద వేడుకల్లో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి (బాబు) అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. అలాగే స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో జె.సీతారామారావు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు కళామందిర్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజా పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ మూరా వరప్రసాద్, యాళ్ళ విశ్వేశ్వరరావు, టీడీపీ నాయకులు గొంతిన సురేష్, పోలిశెట్టి శ్రీను, లాజర్ మధుబాబు, శెట్టిబత్తుల వీరబాబు, మదినే దొరబాబు, రావూరి తాతాజీలు పాల్గొన్నారు. ప్రత్తిపాడు సీఐ ఎం.శేఖర్‌బాబు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎద్దెం చిన్నారావు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయం వద్ద అధ్యక్షుడు సి.పుల్లయ్య, న్యాయవాదులు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. పోతులూరు, చింతలూరులలో అంబేడ్కర్ విగ్రహాలకు లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యుడు బుగతా బంగ్రారాజు పూలమాలలు వేశారు.

ఏలేశ్వరం: మండలంలోని తిరుమాలిలో అంబేడ్కర్ విగ్రహానికి ప్రత్తిపాడు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సత్యప్రభ, టీడీపీ శ్రేణులు పూలమాలలువేసి నివాళులర్పించారు. లింగంపర్తి జైభీమ్ యూత్, జె.అన్నవరంలో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంచారు. యూత్ సభ్యులు బైక్ ర్యాలీ నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ జ్యోతుల పెదబాబు, కౌన్సిలర్లు అలమండ చలమయ్య బొదిరెడ్డి గోపి, మూదినారాయణస్వామి పాల్గొన్నారు.

జగ్గంపేట: జగ్గంపేట టీడీపీ కార్యాలయం వద్ద ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాంబత్తుల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. చంద్రశేఖర్, కొత్త కొండబాబు, జీను మణిబాబు, పాండ్రంగి రాంబాబు, వేముల కొండ జోగారావు, రాయి సాయి, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి తుమ్మల కిషోర్, సాంబత్తుల రాజేష్ ఉన్నారు. కాట్రావులపల్లిలో గొల్లేపల్లి సత్తిబాబు ఆధ్వర్యంలో గుణ్ణం చంద్రమౌళి, ఏలేటిబాబ్జి ఆర్థిక సాయంతో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ పిట్టా సుగుణారావు, ఏలేటి బాబ్జి సుంకర సీతారామయ్య నాగేశ్వరరావు పాల్గొన్నారు. ట్రైనీ ఐపీఎస్ నవజ్యోతిమిశ్రా, పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి, జగ్గంపేట సీఐ లక్ష్మణరావు, ఎస్ఐ నాగార్జున రాజు కాట్రావులపల్లిలో నూతనంగా నిర్మించిన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జై భీమ్ భారత్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వల్లూరి సత్యానందం ఆధ్వర్యంలో గోకవరం రోడ్డులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

గండేపల్లి: టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ కుమార్తె తోట సునీత మండలంలోని యర్రంపాలెంలో టీడీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పెదపాటి సుధాకర్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. టీడీపీ నాయకులు ముత్యాల భాస్కరరావు, ముత్యాల దుర్గారావు, బిక్కిరి వెంకట్రావు, ముత్యాల రాంబాబు, మంచం రాంబాబు, గుణ్ణం రాంబాబు, ముత్యాల వీరభద్రరావు, అంబేడ్కర్ యూత్ సభ్యులు, రొట్టె వీరేంద్ర ఉన్నారు. సూరంపాలెంలోని ఆదిత్య విద్యా ప్రాంగణంలో వివిధ ఇంజనీరింగ్, ఫార్మసీ, పాలిటెక్నిక్, బిజినెస్‌స్కూల్ గ్రంథాలయ విభాగాల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి అంబేడ్కర్ చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్, డీన్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

తుని రూరల్: తుని వీరవరపు పేట, రామకృష్ణ కాలనీ, గొల్ల అప్పారావు సెంటర్ టీడీపీ కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి తుని కూటమి అభ్యర్థి యనమల దివ్య, పలువురు పూలమాల వేశారు. రామకృష్ణా కాలనీ, శ్రీసాయి అన్నపూర్ణ వృద్ధుల ఆశ్రమంలో అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో తుని టీడీపీ పట్టణాధ్యక్షుడు తయినిగంటి సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు సుర్ల లోవరాజు, టీడీపీ యువనేత యనమల రాజేష్, కుసుమంచి శోభారాణి, మళ్ళ గణేష్, మోతుకూరి వెంకటేష్, కుక్కడుపుబాలాజీ, వంగలపూడి శ్రీను, పోలిశెట్టి రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

కోటనందూరు: మండలంలోని ఎస్అర్‌పేట, కోటనందూరులో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి యనమల దివ్య పూలమాలుల వేసి నివాళులర్పించారు. బోమవరపుకోట, పాతకొట్టాం, కెఇచిన్నయ్యపాలెం, అల్లిపూడి గ్రామాల్లో వేడుకలు నిర్వమించారు. గాడిరాజుబాబు, డి.చిరంజీవిరాజు, పెంటకోట భాస్కర సత్యనారాయణ, వెలగా వెంకట కృష్ణారావు,పోతలసూరిబాబు గుడివాడ తాతబాబు చింతకాయల రవికుమార్ పాల్గొన్నారు.

కిర్లంపూడి: కిర్లంపూడి ఎస్సీ పేటలోని అంబేడ్కర్ విగ్రహానికి మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముక్కొల్లులో జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ నివాళులర్పించారు.

తొండంగి: ఏకొత్తపల్లి, తొండంగి, బెండపూడి, ఏవి నగరం తదితర గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బిఎస్పి అభ్యర్థి తంతటి కిరణ్ కుమార్ పిఇచిన్నయ్యపాలెం, రావికంపాడులో అంబేడ్కర్‌కు నివాళి అర్పించారు.

రౌతులపూడి: రౌతులపూడిలో జైభీమ్‌యూత్ అధ్వర్యంలో వేడుకలు నిర్వహించగా డీసీసీబీ డైరెక్టర్ పులి మధుబాబు అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటాన్ని ఊరేగించారు.

తాళ్లరేవు: తాళ్లరేవు అంబేడ్కర్ భవనం వద్ద దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ మండలాధ్యక్షుడు వెంటపల్లి చంద్రమౌళి ఆధ్వర్యంలో దళితనేతలు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. బాబానగర్, తిమ్మరాజుపురం, పి.మల్లవరం, తోటపేట, కోరింగ, సీతారామపురం, జైభీమ్‌పేట, నీలపల్లి, జార్జీపేట, సుంకరపాలెం, ఇంజరంలో వేడుకలు జరిగాయి.

కరప: వైసీపీ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు నడకుదురు, పెనుగుదురు, కరప, వేళంగి, వాకాడలో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు, జడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, వైసీపీ మండలాధ్యక్షుడు చింతా ఈశ్వరరావు ఉన్నారు. పెద్దాపురప్పాడులో భీమ్‌రావ్ సిద్ధార్థ సేవాసంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి జరిగింది. అంబేడ్కర్ యుజనసే సేవాసంఘం సభ్యులు పీతల చంద్రరావు, గుబ్బల రామస్వామి, పోతురాజు వెంకటరమణ, ముడే చంద్రశేఖర్, బుడితి రామారావు, కాలకురచ రాముడు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పెద్దాపురప్పాడు మాజీ సర్పంచ్ గొల్లపల్లి ప్రసాదరావు ప్రారంభించారు.

కొత్తపల్లి: స్థానిక పంచాయతీ కార్యాలయంలో కొండెవరం సర్పంచ్ వేమగిరి చెల్లాయ్యమ్మ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులుర్పించారు. యండపల్లి శివారు జొన్నల గరువు, యండపల్లి జంక్షన్,కొత్తపల్లి దళితపేటల్లో వేడుకలు నిర్వహించారు.

టీడీపీ-జనసేన-బీజేపీ కూటమితో సంక్షేమం

పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప




సామర్లకోట: ఎన్నికల ప్రచారంలో చినరాజప్ప, తాళ్లరేవు: టీడీపీలోకి ఆహ్వానిస్తున్న బుచ్చిరాజు

సామర్లకోట, ఏప్రిల్ 14: టీడీపీ గెలుపుతోనే రాష్ట్రంలో సంక్షేమం సాధ్యపడుతుందని, అందుకోసం టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిగా ఒక్కటయ్యాయని, వైసీపీ ఓటమి కోసం అందరూ సమష్టిగా కష్టపడి పనిచేయాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి సామర్లకోట మండలం నవర గ్రామంలో ఇంటింటా ప్రచారాన్ని కూటమి నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించగా ఎమ్మెల్యే చినరాజప్ప హాజరయ్యారు. కూటమి నాయకులు జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, బీజేపీ ఇన్‌చార్జి విత్తనాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. రాజప్ప మాట్లాడుతూ టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించాలన్నారు. ఐక్యంగా పనిచేయాల్సిన అవస రం కూటమి పార్టీల నాయకులపై ఉందన్నారు. కోరుకున్న పాలన అందించడమే కూటమి లక్ష్యమ న్నా రు. ప్రచారంలో తోటకూర శ్రీనివాస్, చీకట్ల వెంక టేష్, గుమ్మళ్ళ రామకృష్ణ, వెన్నా పద్మనాభం, ఆకు నూరి సత్తిబాబు, కుర్రా నారాయణస్వామి, సర్వేశ్వరరావు, అడ్డాల వెంకన్నబాబు, పెంకే వెంకటలక్ష్మి, సరోజా వాసు, ముమ్మిడి సూరిబాబు, కొప్పిరెడ్డి రాజా, మునిరెడ్డి శ్రీరాములు, మునిరెడ్డి రాంబాబు పాల్గొన్నారు. సామర్లకోట మండలం పండ్రవాడలో మండల స్థాయి బీసీ సమావేశం టీడీపీ నాయకులు నిమ్మకాయల రంగనాగ్, తోటకూర శ్రీనివాస్, రాజా సూరిబాబురాజుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చినరాజప్ప హాజరయ్యారు. విత్తనాల వెంకటరమణ, నరాల వెంకటరమణ, కొప్పిశెట్టి మన్నేశ్వరరావు, అనుబోయిన గోపాలరావు, చీకట్ల వెంకటేష్, ఆకునూరి సత్తిబాబు, కాకినాడ రామారావు, పెంకే వెంకటలక్ష్మి తదితర కూటమి నాయకులు, పాల్గొన్నారు. రాజప్ప గెలుపు కోరుతూ ఇంటింటా ప్రచారాన్ని రాజప్ప తనయుడు రంగనాగ్ చేపట్టారు.

అభివృద్ధికి పెద్ద పీట : దాట్ల

తాళ్లరేవు, ఏప్రిల్ 14: మత్స్యకారుల అభివృద్ధికి టీడీపీ పెద్ద పీట వేస్తుందని ముమ్మిడివరం ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు అన్నారు. తాళ్లరేవు టీడీపీ కార్యాలయంలో గాడిమొగ పంచాయతీ సర్పంచ్ కామాడి గోవలక్ష్మి,మాతరాజు, ఎంపీటీసీ వనమాడి వేణి,నూకరాజు, గ్రామపెద్ద లంకే వీరబాబు, మరో 197మంది వైసీపీ కార్యకర్తలు దాట్ల సమక్షంలో టీడీపీ చేరారు. బీసీలకు సంక్షేమ పథకాలు, రక్షణ చట్టాలను అమలు చేస్తామన్నారు. బీసీలను అభివృద్ధిచేసి ధనవంతులుగా తయారుచేసే బాధ్యత టీడీపీ తీసుకుంటుందన్నారు. వైసీపీ ప్రభుత్వం అనేక అవినీతి కార్యక్రమాలకు పాల్పడిందన్నారు. కార్యక్రమంలో పినపోతు వెంకటేశ్వర్లు, ఓలేటి రాజు, దోమా వీరబాబు, పెమ్మాడి వెంకటేశ్వర్లు, లంకే గంగాద్రావు, కామాడి నరేంద్ర, వైదాడి శివ, మహిళలు ఉన్నారు.

కూటమి అభ్యర్థుల ప్రచారం

గొర్రిపూడి(కరప): సానుభూతి కోసమే రాష్ట్రంలో జగన్నాటకాలు జరుగుతున్నాయని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్తిబాబు, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి ఎద్దేవా చేశారు. కరపమండలం గొర్రిపూడి గ్రామంలో కూటమి తరపున పోటీచేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, పంతం నానాజీల ప్రచార కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఉదయ్‌శ్రీనివాస్, పంతం నానాజీ, మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, అనంతలక్ష్మీ దంపతులు ఇంటింటికి వెళ్లి గాజు గ్లాసు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. కూటమి పార్టీల నాయకులు పంతం సందీప్, గండి వెంకటేశ్వరరావు, బోగిరెడ్డి గంగాధర్, కొండబాబు, బండారు మురళి, గండి యారీష్‌కుమార్, అనుకుల రాంబాబు, పుణ్యమంతుల అన్నారం, తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: జయహో బీసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీసీ నేతలు మండలంలోని గుర్రంపాలెం, గొల్లలగుంట, నగరపేట గ్రామాలకు ప్రత్యేక వాహనంలో బయలుదేరి వెళ్లి బీసీ సెల్ అధ్యక్షుడు తాళ్ళూరు సర్పంచ్ శిలామంతుల వీరబాబు ఆధ్వర్యంలో జ్యోతుల నెహ్రూను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. క్లస్టర్ ఇన్‌చార్జ్ బస్వా చినబాబు, తంగేళ్ల అప్పారావు, సత్తిబాబు, కూసుమంచి సత్యనారాయణ, కూచిమంచి బాలరాజు, బొండా బాబు, జలసూత్ర శ్రీను, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: మండలంలోని పి.జగన్నాధపురంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజా తనయుడు వరుపుల సాయి తర్షిత్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పెదశంకర్లపూడిలో అంబేడ్కర్ విగ్రహానికి తర్షిత్ పూలమాల వేసి కేక్ కట్ చేసి బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాల్లో సూర్నీడి సురేష్, సర్పంచ్‌లు అమరాది వెంకట్రావు, తటవర్తిసుబ్బారావు,రొంగల సత్యనారాయణ, బీజేపీ నాయకుడు ఉమ్మడి వెంకట్రావు, చీకట్ల నాని, కొట్టేటి అబ్బులు, అడ్డాల త్రిమూర్తులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: జగ్గంపేట టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ కుమార్తె తోట సునీత జగపతినగరం గ్రామంలో ఇంటింటా టీడీపీ ప్రచారం నిర్వహించి సైకిల్ గుర్తుపై ఓటేయాలని అభ్యర్థించారు. తోట సర్వారాయుడు, టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు, తూము కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి కుర్ల చినబాబు, గుడాల రాంబాబు, నల్లబ్బాయి, ఆదారి నానాజీ, ఆళ్ల నానాజీ ఉన్నారు.

'కూటమిని గెలిపించాలి'



మాట్లాడుతున్న కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 13: రాష్ట్రంలో టీడీపీ- బీజేపీ-జనసేన పార్టీలు మహాకూటమిగా ఏర్పడి ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయని ఆ పార్టీలకు చెందిన అభ్యర్థులను గెలిపించాలని, రాష్ట్రవ్యాప్తంగా ఈ 3పార్టీల కార్యకర్తలు రెట్టింపు ఉత్సాహంతో పని చేయాలని పలువురు నాయకులు కోరారు. కాకినాడ రామారావుపేటలోని యూనివర్సల్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం జనసేన పార్టీ నాయకుడు,మాజీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దుగ్గన బాబ్జి ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం కాకినాడ సిటీ జనసేన అధ్యక్షుడు తోట సుధీర్ అధ్యక్షతన జరిగింది. జనసేన కాకినాడ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి (బాబు) మాట్లాడుతూ కాకినాడలో వీరమహిళలు, జనసైనికులకు జరిగిన అవమానం జనసేనాని పవన్‌కల్యాణ్ గుర్తించారని అవమానించినవారికి తగిన శాస్తి చేస్తామన్నారు. ఎంపీగా తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, కాకినాడ ఎమ్మెల్యేగా వనమాడి కొండబాబును గెలిపించాలన్నారు. ఉదయ్‌శ్రీనివాస్ మాట్లాడుతూ కాకినాడ అభివృద్ధికి తన వద్ద ప్రత్యేక ప్రణాళిక ఉందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి కొండబాబు మాట్లాడుతూ కాకినాడలో ప్రజల పన్నులు చెల్లిస్తే కార్పొరేషన్ నుంచి ఎమ్మెల్యే ద్వారంపూడి టీడీఆర్ బాండ్ల రూపంలో రూ.750కోట్లు, ఓఎన్జీసీకి చెందిన మత్స్యకారుల సొమ్ము రూ.1000 కోట్లు దోచేశారన్నారు. కార్యక్రమంలో జనసేన ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు చిక్కాల దొరబాబు, పెసింగి ఆదినారాయణ, మల్లిపూడి వీరు, దాసరి కిరణ్, ఆకుల శ్రీనివాస్ ఉన్నారు.

'పవన్ గెలుపును ఆపలేరు'

అమీనబాద్ (కొత్తపల్లి), ఏప్రిల్ 14: వైసీపీ ఎన్ని జిమ్మిక్కులు చేసినా పిఠాపురం నియోజకవర్గంలో ఎన్‌డీఏ అభ్యర్థి పవనకల్యాణ్ గెలుపును ఆపలేరని కొత్తపల్లి సురక్ష మల్టీస్పెషాలిటీ హాస్పటల్ అధినేత డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్ అన్నారు. గాజుగ్లాసు గుర్తుకు ఓటేసి పవన్ గెలిపించాలని అమీనబాద్‌లో ఆదివారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఎన్‌డీఏ ప్రభుత్వంలో అమలు చేసే సంక్షేమ, అభివృద్ధి పథకాల కరపత్రాలను గ్రామస్తులకు పంపిణీ చేశారు. జనసేన నాయకులు వంకా కొండబాబు, వెంకట్రావు, గుండ్ర జగ్గారావు, గెద్దం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. అలాగే పవన్ కు మద్దతుగా సినీనటుడు సాగర్ ఎన్నికల ప్రచారం నిర్వహి ంచారు. స్వచ్ఛ ఫౌండేషన్ అధినేత మురాల శెట్టి సునీల్‌కుమార్, జనసేన నాయకుడు తెలగంశెట్టి వెంకటేశ్వరరావు ఉన్నారు.

గొల్లప్రోలులో ప్రచారం

గొల్లప్రోలు, ఏప్రిల్ 14: గొల్లప్రోలులోని దేవినగర్‌లో పిఠాపురం నుంచి పోటీ చేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్, కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌లకు గాజుగ్లాసు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో జనసేన నాయకురాలు డీకే చైతన్య ఆదికేశవులు, పలు కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న డీకే చైతన్య ఆదికేశవులు